క్లుప్తంగా

ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి

● మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



పూజలో పాల్గొన్న మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర

సాలూరు: కలియుగ దైవం ఆ వేంకటేశ్వరుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్న దొర ప్రార్థించారు. ఈ మేరకు బుధవారం ఆయన సాలూరు పట్టణంలో వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి, హోమం కార్యక్రమంలో పాల్గొన్నారు.

521 గోశాలల నిర్మాణాలకు ప్రతిపాదనలు

● మంజూరైనవి 24

సీతానగరం: మండలంలోని పాల ఉత్పత్తి దారులకు పాడిపశువుల పెంపకానికి గోశాలల నిర్మాణం అవసరం ఎంతైనా ఉందని మండల పశువైద్యాధికారి ఎస్.రామారావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ మండలంలో 521 గోశాలల నిర్మాణాలకు పాడి రైతుల నుంచి దరఖాస్తులు రాగా మొదటి విడతగా 24 గోశాలల నిర్మాణానికి ఉపాధి హామీ పథకం నిధులు రూ.24 లక్షలు విడుదల చేసినట్లు చెప్పారు. మిగతా 499 గోశాలలకు నిధులు మంజూరు కావలసి ఉందని తెలియజేశారు. గోశాలల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులందరికీ నిధులు త్వరలో విడుదల కానున్నాయని చెప్పారు.

10 గ్రామాల భక్తుల అయప్ప దీక్ష



అయ్యప్ప దీక్ష తీసుకుంటున్న స్వాములు

పార్వతీపురంటౌన్: పట్టణంలోని దుర్గ చెట్టు శ్రీవిద్య సర్వమంగళదేవి పీఠం ప్రాంగణంలో కొలువై ఉన్న అయ్యప్ప స్వామి దేవాలయం ప్రాంగణంలో బుధవారం కాళిదాసు గురుస్వామి ఆధ్వర్యంలో సుమారు 10 గ్రామాల భక్తులు అయ్యప్ప స్వామి దీక్ష తీసుకున్నారు. ఈ సందర్భంగా గురుస్వాములు కాళిదాసు, వీర్రాజులు మాట్లాడుతూ దేవాలయం ప్రాంగణంలో గత 15 సంవత్సరాలనుంచి జరుగుతున్న అన్నదానం ఈ సంవత్సరం కుడా నూతనంగా నిర్మించిన జ్యోతిస్వరూప సన్నిధిలో డిసెంబర్ 5వ తేదీ వరకు అయ్యప్ప, భవాని, శివ, దీక్ష తీసుకున్న స్వాములకు రోజూ మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరుగుతుందని తెలియజేశారు. ఈ అవకాశాన్ని స్వాములు వినియోగించుకోవాలని కోరారు

రక్షిత నీరు అందించకపోతే ఆందోళన



సమస్యలపై చర్చిస్తున్న గిరిజనులు

సీతంపేట: మండలంలోని మర్రిపాడు పంచాయతీ పరిధిలో గల ఎగువ, నడిమి, దిగువ ద్వారబందం మూడు గ్రామాలకు రక్షిత మంచినీటి సౌకర్యం కల్పించకపోతే ఆందోళన తప్పదని గిరిజన సంఘ జిల్లా అధ్యక్షుడు ఎం.లక్ష్మణరావు డిమాండ్ చేశారు. ఆయా గ్రామాల గిరిజనులతో బుధవారం సమావేశం నిర్వహించారు. మౌలిక వసతులు కల్పించాలని పలుమార్లు అధికారులను కోరినా, ఫలితం లేకపోయిందన్నారు. ఇప్పటికై నా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు గిరిజనులు పాల్గొన్నారు.

అధికారుల పనితీరు మారాలి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): వ్యవసాయాధికారి పనితీరు మార్చుకోకపోతే ఫిర్యాదు తప్పదని ఎంపీపీ శెట్టి పద్మావతి హెచ్చరించారు. కురుపాం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ వ్యవసాయ శాఖకు సంబంధించిన సమాచారం ఇవ్వకుండా ఇష్టమొచ్చినట్లు వ్యవహరించి రైతులకు తీవ్ర నష్టం కలిగించారన్నారు. రైతులకు సాగు అవసరమైన వ్యవసాయ పరికరాలు, పనిముట్లు, ఎరువులు, విత్తనాలు అందించడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. రైతులకు అవసరమైన టార్పాలిన్‌లు కూడా అందించడంలేదన్నారు. కేవలం 150 టార్పలిన్లు అందించి మమ అనిపించేసారని పెదగొత్తిలి సర్పంచ్ లోకనాథం అన్నారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలను త్వరగా పూర్తి చేసి విద్యార్థులకు వసతి సదుపాయం కల్పించాలని మొండెంఖల్ సర్పంచ్ గౌరీశంకరరావు, ఎంఈఓ సత్యనారాయణను కోరారు. పంచాయతీల అభివృద్ధికి సర్పంచ్‌లకు సమాచారం తెలియకుండా ఎలా ప్రతిపాదనలు చేస్తారని పలువురు సర్పంచ్‌లు ఈఓపీఆర్‌డీ రమేష్‌ను ప్రశ్నించారు. సమావేశంలో ఎంపీడీఓ జె.ఉమామహేశ్వరి, తహసీల్దార్ ఎం.రవణమ్మ, జెడ్పీటీసీ జి.సుజాత, వైస్‌ఎంపీపీలు అన్నాజీరావు పాల్గొన్నారు.

అర్హులైన ఉపాధ్యాయులు ఓటరుగా నమోదు కావాలి



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నియమ నిబంధనలను వివరిస్తున్న ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.బాలకృష్ణ

పార్వతీపురంటౌన్: అర్హులైన ఉపాధ్యాయులందరూ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసనమండలి నియోజకవర్గంలో ఓటరుగా నమోదు చేసుకోవాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లా బాలకృష్ణారావు కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన పార్వతీపురం పట్టణంలోని పలు పాఠశాలలను సందర్శించి ఓటరు నమోదుకు నియమనిబంధనలు తెలిపారు. ఉత్తరాంధ్రలోని మూడు ఉమ్మడి జిల్లాల్లో ఏ ప్రాంతంలోనైనా నివాసం ఉండి 1నవంబరు 2018 నుంచి 31 అక్టోబర్ 2024 మధ్య కాలంలో కనీసం 3 సంవత్సరాలు సెకండరీ పాఠశాల లేదా ఆ పై స్థాయి విద్యా సంస్థలలో పనిచేసి ఉన్న ఉపాధ్యాయులు, జూనియర్, సీనియర్ ఉపన్యాసకులు, కేజీబీవీ, ఆదర్శ పాఠశాలలు, గిరిజన సంక్షేమ తదితర పాఠశాలల్లో పనిచేసిన, చేస్తున్న ఉపాధ్యాయులు ఓటు నమోదుకు అర్హులని తెలిపారు. 2021 అక్టోబర్ ఆ తరువాత రిటైర్ అయిన వారు కూడా ఓటరుగా నమోదు చేసుకోవడానికి అర్హులేనన్నారు. ఉపాధ్యాయుల నివాస ధ్రువీకరణ పత్రం ఆధారంగా ఆయా మండలాల్లో ఓటును నమోదు చేస్తారని చెప్పారు. ఉపాధ్యాయులు ప్రస్తుతం పని చేస్తున్న మండలాల్లో తహసీల్దార్‌కు దరఖాస్తు చేయవచ్చునని తెలిపారు. ఒక పాఠశాలకు సంబంధించిన దరఖాస్తులన్నీ ప్రధానోపాధ్యాయుడి దరఖాస్తుతో సహా వారు పనిచేస్తున్న మండల తహసీల్దార్ల కార్యాలయంలో ఇవ్వాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు వారి దరఖాస్తును సెల్ఫ్ అటెస్ట్ చేసుకోవచ్చని, వేర్వేరు పాఠశాలల్లో 3 సంవత్సరాల సర్వీసు కలిగి ఉంటే ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల నుంచి పొందిన సర్వీసు సర్టిఫికెట్ జతచేయాలని స్పష్టం చేశారు.

నవంబర్ 6 లోగా ఓటు దరఖాస్తు

దరఖాస్తుతో పాటు కలర్ పాస్‌పోర్ట్ ఫోటో అతికించాలని, ఫొటో అటెస్టేషన్ చేయకూడదన్నారు. ఎన్నిక జరిగే జిల్లాలో నివాసం ఉండి, వేరే జిల్లాల్లో సెకండరీ, ఆపై స్థాయి పాఠశాలల్లో ఉపాధ్యాయునిగా పనిచేసినవారు కూడా ఓటు నమోదుకు అర్హులవుతారని వివరించారు. నవంబరు 6 వ తేదీలోగా దరఖాస్తులను సంబంధిత తహసీల్దార్ కార్యాలయాలకు అందజేయాలని కోరారు. ఈ పర్యటనలో ఉమ్మడి విజయనగరం జిల్లా అధ్యక్షుడు బంకురు జోగినాయుడు, జిల్లా ఉపాధ్యక్షురాలు వలిరెడ్డి ప్రమీల, ఏపీటీఎఫ్ నాయకులు పడాల రమేష్ పాల్గొన్నారు.

జల్‌జీవన్ మిషన్ మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీరు



కుళాయిల ద్వారా పంపిణీ అవుతున్న తాగునీరు

సీతానగరం: మండలంలోని పెదభోగిలి మేజర్ పంచాయతీ పరిధిలో ఉన్న గ్రామాల ప్రజలకు జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవన్‌కుమార్ సర్పంచ్ జె.తేరేజమ్మ అన్నారు. మేజర్ పంచాయలోని ఎస్సీ కాలనీలో బుధవారం తాగునీరు పంపిణీ కార్యక్రమాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెదభోగిలి మేజర్ పంచాయతీలో సీతానగరం, పెదభోగిలి, అప్పయ్యపేట, బుడ్డిపేట, హడ్కో కాలనీ గ్రామాలున్నాయని, సీతానగరం, పెదభోగిలి, అప్పయ్యపేట, హడ్కో కాలనీల్లో జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటి కుళాయిలు ఇప్పటికే ఏర్పాటు చేశామని చెప్పారు. పెదభోగిలి ఎస్సీ కాలనీలో ఇంటింటి కుళాయిల పనులు పూర్తి కావడం ట్యాప్‌లు అమర్చడంతో తాగునీరు సరఫరా చేసినట్లు తెలిపారు. తాగునీరు వృథా కాకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ సహాయకులు సంతోష్‌కుమార్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరులకు జోహార్లు



అమరులైన పోలీసులకు జోహారులర్పిస్తున్న మహిళలు

సీతానగరం: దేశభద్రత కోసం శ్రమించి అసువులు బాసిన పోలీసుల సేవలు శ్లాఘనీయమని ఎస్సై గంటా శ్రీనివాసరావు అన్నారు.పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని బుధవారం చినభోగిలి గ్రామీణ గ్రంథాలయం ఆవరణలో సర్పంచ్ కె.రాధ, శ్రీని వాసరావుల ఆధ్వర్యంలో పోలీసు అమర వీరుల సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమరులైన పోలీస్ సిబ్బంది కుటుంబాలకు మనోధైర్యాన్ని కల్పిస్తూ వారు చేసిన త్యాగాలకు గుర్తుగా గ్రామాల్లో సేవా కార్యక్రమాలు, నివాళులర్పించే కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, సచివాలయ సిబ్బంది, ఆశవర్కర్లు, హెచ్‌సీలు, పీసీలు, సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంటదిగుబడితోనే రైతాంగానికి ఆర్థికంగా లబ్ధి



పామాయిల్ తోటలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు

● శాస్త్రవేత్త భారతి

సీతానగరం: నీటి వనరులున్న భూముల్లో పాటించే మెలకువలతో రైతులు పండించే పంటల్లో వచ్చే దిగుబడితోనే ఆర్థికంగా లబ్ధిపొందవచ్చని జిల్లా వ్యవసాయ వనరుల అధికారి ఏడీఏ భారతి అన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని తామరఖండి, బగ్గందొరవలస, కాశీపేట గ్రామాల రైతులు పండించే ఉద్యాన పంటలు, వరిచేను దిగుబడులపై నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా రైతులకు పలు అంశాలపై ఆమె అవగాహన కల్పించారు. అలాగే కార్యక్రమంలో ఏఓ ఎస్.అవినాష్, ఉద్యాన అధికారి ప్రత్యూష మాట్లాడుతూ పంటల సాగు, దిగుబడులు, పంటకోత ప్రయోగాలను రైతులు చేయించుకోవాలని సూచించారు.

కార్యక్రమంలో ఆయాగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, రైతు నాయకులు ఏగిరెడ్డి శ్రీనివాసరావు, స్వామినాయుడు, సూర్యనారాయణ, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

పాలకొండ :

పట్టణంలోని పెట్రోల్ బంక్ వద్ద అగ్ని ప్రమాదాల నివారణపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్ని మాపక అధికారి జామి సర్వేశ్వరరావు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. అలాగే పెంట్రోల్ బంక్ నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

రెండో రోజూ విశ్వశాంతి పూజలు



హోమం పూజలు చేస్తున్న పీఠాధిపతులు, అర్చకులు

సీతానగరం: మండలకేంద్రంలోని వేణుగోపాలస్వామి, లక్ష్మీనృసింహస్వామి ఆలయ ప్రాంగణంలో రెండోరోజూ బుధవారం విశ్వశాంతి శ్రీమద్ భాగవత సప్తాహజ్ఞాన యజ్ఞపూజలు జరిగాయని అర్చకుడు శ్రీనివాసాచార్యులు తెలియజేశారు. పనసలవలస శ్రీవైష్ణవాచార్య పీఠం పరంపరాగత పీఠాధిపతి శ్రీమత్తిరుమల రంగనాథం అయ్యవార్లంగార్ ప్రత్యక్ష పర్యవేక్షణలో బ్రహ్మోత్సవం 20 మంది రుత్వికుల ఆధ్వర్యంలో పీసపాటి రామానుజాచార్యులు నేతృత్వంలో పూజలు జరుతున్నాయని తెలియజేశారు. ఈ సందర్భంగా ఉదయం పూట హోమం, సాయంత్రం విష్ణు సహస్ర నామ పారాయణం, ప్రవచనాలు జరిగాయని వివరించారు. భక్తులకు మోక్షం చూపే మహోన్నత పురాణమే శ్రీమత్ భాగవతమని వారు ప్రవచనాలద్వారా తెలియజేశారన్నారు. పూజా కార్యక్రమాల్లో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

● అడుగుకో గొయ్యి



బ్రిక్ ఇండస్ట్రీ వద్ద గోతులతో ఉన్న బీటీరోడ్డు



బగ్గందొరవలస కంత పోలమ్మగుడి సమీపంలో ఏర్పడిన గొయ్యి



సాగునీరు కాలువ సమీపంలో బీటీ రోడ్డుపై గోతులు

సీతానగరం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్లన్నీ మరమత్తులు చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఐదు నెలలు కావస్తున్నా కనీసం గోతులను కూడా పూడ్చలేదు. బగ్గందొవలస–తామరఖండి గ్రామాల మధ్య ఉన్న బీటీరోడ్డు భారీ గుంతలతో నిండిపోయింది. వర్షాలకు ఆ గోతుల్లో నీరు చేరి చెరువులను తలపిస్తోంది. ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని ప్రయాణాలు సాగిస్తున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ఈ ప్రాంతం ప్రజలు కోరుతున్నారు.



ప్రమాదాలకు నిలయంగా శిథిలమైన కల్వర్టు



బగ్గందొరవలస జంక్షన్ సమీపంలో చెరువును తలపిస్తున్న రోడ్డు

సేవలకు సెలవేనా...?

● తెరుచుకోని ప్రభుత్వ వెబ్‌సైట్లు
● వెలవెలబోతున్న సచివాలయాలు
● అవస్థలు పడుతున్న ప్రజలు

పాలకొండ రూరల్:

గ్రామ స్వరాజ్య స్థాపన మహాత్ముని కల. క్షేత్రస్థాయిలో జరిగే అభివృద్ధే దేశానిక వెన్నెముక అని జాతిపిత గాంధీజీ అనేక సందర్భాల్లో తెలిపారు. ఇందుకు అణుగుణంగా మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను రూపొందించారు. లక్షలాది మంది నిరుద్యోగ యువతకు సర్కారు కొలువు అందించారు. పంచాయతీ స్థాయిలో రెండు వేల మంది జనాభాకు ఒక సచివాలయం ఏర్పాటు చేశారు. గ్రామ ప్రజలకు అవసరమైన ప్రతి పనీ స్థానికంగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. దీంతో సచివాలయం వ్యవస్థ అనతికాలంలో విజయవంతమైంది. వలంటీర్ల సహకారంతో అర్హులకు ఇళ్ల వద్దే సంక్షేమ పథకాలు అందేవి. అయితే ఇదంతా గతం.. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ వ్యవస్థకు తూట్లు పొడుస్తోంది. సచివాలయాల్లో అందే సేవల్లోనూ కోత విధించింది.


ఎన్నో ప్రయోజనాలు.....

నాడు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చారు. దీనికి అనుసంధానంగా వలంటీర్లను నియమించారు. ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్ వారి ఇళ్ల వద్దనే సేవలందించేలా చూశారు. సచివాలయాల్లో దాదాపు 545 రకాల సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ వ్యవస్థ ప్రజలందరికీ ఎంతో ఉపయోగకరంగా ఉండేది. వివిధ రకాల ధ్రువీకరణ పత్రాల కోసం మండల కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండేది కాదు. రిజిస్ట్రేషన్లు కూడా సచివాలయాల్లో నిర్వహించేలా వాటి స్థాయిని పెంచారు.



వెలవెలబోతున్న వాటపాగు సచివాలయం

వ్యవస్థను మరింత మెరుగ్గా నడిపించాలి..



సచివాలయాల్లో గతంలో మాదిరిగానే సేవలు కొనసాగించాలి. రేషన్, పింఛన్ కార్డులు, ఇతర అవసరాల కోసం ప్రజలు దరఖాస్తులు చేసుకునేలా ప్రభుత్వం విధివిధానాలను రూపొందించి వెబ్‌సైట్లను అందుబాటులోకి తీసుకురావాలి. వ్యవస్థలను మరింత మెరుగ్గా నడిపిస్తే ప్రజల్లో విశ్వాసం పెరుగుతుంది. అంతే తప్ప గత ప్రభుత్వంపై కక్షతో వారికి పేరు వస్తున్నందన్న నెపంతో సచివాలయాలను నిర్వీర్యం చేసేలా అడుగులు వేయడం సరికాదు.

– లోలుగు విశ్వేశ్వరరావు, మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు, పాలకొండ

తెరుచుకోని వెబ్ సైట్లు.....

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ సచివాలయాల వైభవం తగ్గిపోయింది. ఇప్పటికే వలంటీర్ల వ్యవస్థను కుదేలు చేసిన కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను కూడా నిర్వీర్యం చేసేలా చర్యలు తీసుకుంటోందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో అందించే సేవలను తగ్గించుకుంటూపోతున్నారు. కులం, ఆదాయం, వన్ బీ, తదితర సాధారణ సేవలు మాత్రమే ప్రస్తుతం సచివాలయాల్లో అందుబాటులో ఉన్నాయి. రేషన్‌కార్డులు, నూతన పింఛన్లు. ఆరోగ్యశ్రీ కార్డుల జారీ, తదితర వెబ్‌సైట్లు ఓపెన్ కావడం లేదు.

ఏజెన్సీలో...

మైదాన ప్రాంత ప్రజలతో పోల్చుకుంటే ఏజెన్సీ గిరిజనులకు సచివాలయ వ్యవస్థ ఎంతో మేలు చేసింది. కొండలపై, సుదూర ప్రాంతాల్లో ఉన్న వారు పంచాయతీ, మండల కేంద్రాలకు వచ్చి పనులు చేయించుకునేందుకు ఇబ్బందిపడేవారు. సచివాలయాలు ఏర్పాటయ్యాక వారి సమస్యలన్నీ తీరాయి. నియోజకవర్గంలో సీతంపేట ఏజెన్సీలో 53 పంచాయతీల పరిధిలో 456 గూడలున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఇక్కడి గిరిజనులకు సేవలు అందించే క్రమంలో 31 సచివాయాలు ఏర్పాటు చేశారు. ఒక్కో సచివాలయంలో రోజుకు పది నుంచి 15 అర్జీలు రాగా.. వాటిని వెంట వెంటనే పరిష్కరించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు.

నాలుగు మండలాల్లో 98 సచివాలయాలు

నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 98 సచివాలయాలున్నాయి. వీటిలో దాదాపు 624 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ప్రస్తుత కూటమి నాయకులు నాడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సచివాలయ ఉద్యోగులపై అనేక విమర్శలు చేశారు. నేడు కూటమి ప్రభుత్వానికి సచివాలయ ఉద్యోగులే దిక్కుగా మారారు. ముఖ్యంగా సామాజిక పింఛన్ల పంపిణీలో కీలకంగా ఉన్నారు.

సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తం

● ఎస్సై అమ్మన్నరావు

సీతంపేట:

సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్సై అమ్మన్నరావు సూచించారు. బుధవారం స్థానిక వైటీసీలో శిక్షణ పొందుతున్న నిరుద్యోగులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సైబర్ క్రైమ్ ఎలా జరుగుతుందో వివరించారు. క్రెడిట్ కార్డు పేరిట మోసాలకు పాల్పడుతుంటారని, ఇంకా పలు రకాలుగా కాల్స్ చేస్తుంటారని, అటువంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సైబర్ మోసాల బారిన పడితే తక్షణమే టోల్ ఫ్రీ నంబర్ 1930ను గాని, నేషనల్ కస్టమర్ హెల్ప్‌లైన్ 1800-11-4000 నంబర్‌కు గాని ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.